క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో జాతీయ జెండావిష్కరణ

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఉదయం 8గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మేయర్ కొలన్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కమిషనర్ రామకృష్ణరావు ముఖ్యఅతిథులుగా హాజరై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాలాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులతో పాటు వివిధ రాజకీయ పక్షాలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని మేయర్ కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది.

మర్యాదపూర్వక కలయిక



ఇమ్రాన్ ప్రతాప్‌ఘడ్‌తో సమీర్ ఖాన్

జగద్గిరిగుట్ట: గాంధీ భవన్‌లో గురువారం నిర్వహించిన మైనారిటీ సెల్ కార్యవర్గ సమావేశానికి రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జాతీయ అధ్యక్షులు ఇమ్రాన్ ప్రతాప్‌ఘడ్ ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా టీపీసీసీ స్టేట్ జాయింట్ కన్వీనర్ మైనారిటీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన సమీర్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిసారు.

హాథ్ సే హాథ్ జోడో

సుభాష్‌నగర్: పింఛన్లు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం వృద్ధులను ఇబ్బందులకు గురి చేస్తోందని.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను మంజూరు చేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా గురువారం దార్వకానగర్, గాజులరామారం గ్రామాల్లో ఆయన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కుటుంబ సభ్యులే బాగు పడ్డారని అన్నారు. ప్రతి ఇంటికి ఉద్యోగం ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. కేసీఆర్‌ను ఇంటికి పంపిస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేసే కాంగ్రెస్ పార్టీని బలపరచాలని ఆయన కోరారు. కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, జహంగీర్, గణేష్, అజయ్, రాహుల్, శ్రీనివాసగుప్తా, రాధా, శారదా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్సీకి వినతులు



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

దుండిగల్: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు గురువారం ఆయనను క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై పలువురు ఆయనకు వినతి పత్రాలను అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే వివిధ శాఖల అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన

జగద్గిరిగుట్ట: సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సంజయ్‌పురికాలనీలో రూ.17లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.

నేలకొరగక ముందే తొలగించండి



షాపూర్‌నగర్- గాజుల రామారం చౌరస్తాలో

రంగారెడ్డినగర్: ప్రధానరోడ్ల వెంబడి మోడుబారిన వృక్షాలతో ప్రజలకు ముప్పు పొంచి ఉంది. షాపూర్‌నగర్ చౌరస్తాలోని గాజులరామారం వెళ్లే రహదారిని వైపు ఆలయం పక్కనే ఓ భారీ వృక్షం ఎండిపోయి ఉంది. ఇటుగా ప్రతినిత్యం వందలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అదే విధంగా సమీపంలో ఆటోలు, బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు నిలుచుంటున్నారు. కొన్ని రోజులుగా చెట్టు ఎండిపోయి ఎప్పుడు కూలుతుందన్నట్లుగా ఉన్నా అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లెనా ఉండటం లేదు. వృక్షం కూలకముందే తొలగించాలని పలువురు కోరుతున్నారు.

రేపటి నుంచి బడిబాట

దుండిగల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రణాళికలు సైతం రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బడి-బాట'కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నిమగ్నమయ్యారు. కరోనా సంక్షోభంలో విద్యార్థుల సంఖ్య తగ్గినప్పటికీ గత రెండు సంవత్సరాల నుంచి విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగింది.

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 108 పాఠశాలలు ఉన్నాయి. అందులో 21 ఉన్నత, ఒకటి ప్రాథమికోన్నత, 86 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులను మినహాయిస్తే 1వ నుంచి 9వ తరగతి వరకు 24,254 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి ఏడాది 1500 నుంచి 1800 వరకు విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందుతున్నారు. ఈ దఫా వాటి సంఖ్య



రెండింతలు పెంచే విధంగా కృషి చేస్తున్నారు.

3వ తేదీ నుంచి ప్రత్యేక కార్యక్రమాలు..

విద్యార్థుల హాజరు శాతం పెంచే ప్రధాన ఉద్దేశంతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బడి ఈడు పిల్లలందరిని తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నారు. వీటిపై రాష్ట్ర విద్యా శాఖ ఇప్పటికే మార్గదర్శకాలను రూపొందించింది.

◆ ఈనెల 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

◆ ముందుగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాలు, ఆశా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఆయా ప్రాంతాల్లో గ్రామ సభలను నిర్వహిస్తారు. బడిబాట లక్ష్యాలను సాధించడానికి కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తారు. పాఠశాల రోజువారీ కార్యచరణ తయారు చేస్తారు.

◆ గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా పైన పేర్కొన్న సభ్యులు ర్యాలీలు, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాల పంపిణీతో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తారు.

◆ మన ఊరు-మన బడి, ఇంగ్లీష్ మీడియం, ఎఫ్ఎల్ఎన్ తదితర ప్రభుత్వ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.

◆ అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 సంవత్సరాలు పైబడిన అర్హత కలిగిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించే విధంగా అంగన్‌వాడీలతో సమన్వయం చేసుకుంటారు.



బడిబాట కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

◆ బడి ఈడు, బడి మానేసిన, బాల కార్మికులు, దీర్ఘకాలికంగా పాఠశాలలకు హాజరు కాని విద్యార్థులను గుర్తించి స్వయం సహాయక సంఘాల వారి సహాయంతో పాఠశాలలో నమోదు చేయిస్తారు.

◆ ప్రత్యేక అవసరాల గల పిల్లలు పిల్లలను గుర్తించి వీలైతే పాఠశాల లేదా భవిత కేంద్రాల్లో నమోదు చేయిస్తారు.

◆ పిల్లల్లో భయాన్ని పొగొట్టి విద్య పట్ల ఆసక్తి కలిగించి పాఠశాల వాతావరణం అలవాటయ్యే విధంగా సంసిద్ధం చేస్తారు.

విద్యార్థుల సంఖ్యను పెంచుతాం



ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల హాజరు శాతం, ప్రవేశాలు పెంచే విధంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రతి సంవత్సరం చక్కటి ఫలితాలను సాధిస్తున్నాం. ఈ ఏడాది కూడా విద్యార్థుల సంఖ్యను పెంచుతాం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్పెషల్ అధికారులు, సీఆర్‌పీలు అదే పనిలో ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సహకరిస్తున్నారు.

– ఆంజనేయులు

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. 'కుత్బుల్లాపూర్ గోస - శ్రీశైలం అన్న భరోసా'కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన గాజులరామారం డివిజన్ పరిధిలోని చంద్రగిరినగర్, అంబేడ్కర్‌నగర్, ఉమాదేవినగర్ బస్తీలలో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చంద్రగిరినగర్‌లో పూర్తిగా ధ్వంసమైన రోడ్డును పరిశీలించారు.

◆ అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. బస్తీల అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా రూ.1.50 లక్షలతో ఉమాదేవినగర్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టానని గుర్తు చేశారు. తొమ్మిదేళ్లు కావస్తున్నా ఇప్పటికి అవే డ్రైనేజీ లైన్లు, రోడ్లే దర్శనమిస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే



వృద్ధురాలిని అప్యాయంగా పలకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

ప్రగతియాత్ర పేరుతో ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా రెపరెపలాడటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ చైర్మన్, నాయకులు కూన శ్రీనివాస్‌గౌడ్, బుచ్చిరెడ్డి, రాముగౌడ్, శేఖర్‌ముదిరాజ్, కృష్ణయాదవ్, రాజిరెడ్డి, బిల్లా వెంకటేష్, పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ స్కూల్ డ్రైవర్ల ఆందోళన



స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న బస్సు డ్రైవర్లు

దుండిగల్: అకారణంగా తమను విధుల్లో నుంచి తొలగించేందుకు పాఠశాల యాజమాన్యం ప్రయత్నిస్తుందని ఓ స్కూల్‌కు చెందిన బస్సు డ్రైవర్లు ఆరోపించారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్ ముందు గురువారం బైఠాయించి ఆందోళన చేపట్టారు. 10 సంవత్సరాల నుంచి సదరు పాఠశాలలో బస్సు డ్రైవర్లుగా పని చేస్తున్నామన్నారు. ఇప్పుడు ఓ రవాణాను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారని తెలిపారు. సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిబంధనలు పెడుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. అగ్రిమెంట్లపై సంతకాలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాడని పేర్కొన్నారు. లేని పక్షంలో గత నెల వేతనం కూడా చెల్లించకుండా విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరిస్తున్నాడని అన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే స్కూల్ గేటుకు తాళం వేసి లోపలికి కూడా రాకుండా అడ్డుకుంటున్నారని బస్సు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి బీజేపీ నేతలు ఎస్.మల్లారెడ్డి, పీసరి కృష్ణారెడ్డి తదితరులు మద్దతు తెలిపారు. ఈ అంశం జిల్లా లేబర్ అధికారి దృష్టిలో ఉందన్నారు. మరో 15 రోజులు గడువు ఇవ్వాలని పాఠశాల యాజమాన్యంతో చర్చించడంతో గొడవ సద్దుమణిగింది.

ఇలాగే వదిలేస్తే జారి పడతారు!

● రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, ఇసుక

రంగారెడ్డినగర్: జంట సర్కిళ్ల పరిధిలో రోడ్ల వెంబడి పేరుకుపోయిన మట్టి, ఇసుక రేణువులను స్వీపింగ్ మెషిన్లతో శుభ్రం చేయాల్సిన ఏజెన్సీలు ఆ దిశగా చేయడం లేదు. కేవలం ప్రధాన రోడ్లపైనే శుభ్రం చేస్తూ మిగతా రోడ్లను అలాగే వదిలేస్తున్నారు. షాపూర్‌నగర్ చౌరస్తా సమీపంలోని గాజులరామారం-షాపూర్‌నగర్ రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షాలతో మట్టి, ఇసుక మేటలు వేసింది. స్థానికంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించే సిబ్బంది చెత్తను ఊడుస్తున్నారే తప్ప మట్టిని తొలగించడం లేదు. అటు ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాహకులు, ఇటు సిబ్బంది మట్టిని తొలగించకపోవడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో పలువురు వాహనదారులు జారి పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



షాపూర్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, ఇసుక

బీఆర్ఎస్ పాలనలో సర్వతోముఖాభివృద్ధి దిశగా తెలంగాణ

జగద్గిరిగుట్ట: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా గురువారం ఆయన జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని షిర్డీహిల్స్‌లో పర్యటించి స్థానికంగా పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం షిర్డీహిల్స్-బీలో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపడుతున్న కమిటీ హాలు, బుద్ధభవన్ కాంపౌండ్ వాల్, సంజయ్‌పురి కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకుల హయాంలో అభివృద్ధికి నోచుకోని అనేక బస్తీలు నేడు మౌలిక సదుపాయలతో కళకళలాడుతున్నాయని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో బస్తీల రూపురేఖలే మారిపోయాయన్నారు. ప్రజలకు సౌకర్యాలు అందించేందుకు ఎన్ని కోట్ల నిధులైనా వెచ్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

◆ రాజీవ్ గృహకల్ప, భూదేవిహిల్స్‌లలో తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కూకట్‌పల్లికి చెందిన దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రం సౌజన్యంతో ఏర్పాటు చేసిన కిశోర బాలికల ఉచితంగా టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే వివేకానంద్, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ మేనేజర్ లక్ష్మీకుమారితో కలిసి ప్రారంభించారు.

◆ సంజయ్‌పురికాలనీలో రూ.5 లక్షల కాలనీవాసుల కాంట్రిబ్యూషన్‌తో ఏర్పాటు చేసిన 41 సీసీ కెమెరాలను ఎమ్మెల్యే, సీఐ క్రాంతికుమార్‌లు ప్రారంభించారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రుద్ర అశోక్, నాయకులు సయ్యద్ రషీద్, కృష్ణ గౌడ్, బాబు గౌడ్, వేణుయాదవ్, పాపిరెడ్డి తదితరులు ఉన్నారు.



భూదేవిహిల్స్‌లో టైలరింగ్ ఉచిత శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

5న ప్లాస్టిక్ కాలుష్యంపై సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5న ఓయూ దూరవిద్య కేంద్రంలో జాతీయ సదస్సు జరగనుంది. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కాలుష్యం పరిష్కారం అనే అంశం పై జరిగే జాతీయ సదస్సు వాల్‌పోస్టర్‌ను గురువారం వీసీ రవీందర్, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్బీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, పబ్లిక్ పాలసీ ఎక్స్‌పర్ట్ డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి వక్తలుగా పాల్గొని ప్రసంగిస్తారని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ నవీన్ తెలిపారు.

ఫీజులు తగ్గించే వరకూ పోరాడతాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం పాలక మండలి సమావేశం జరుగుతుండగా పీహెచ్‌డీ ఫీజుల పెంపు అంశాన్ని చర్చించేందుకు కార్యాలయంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకొని పీఎస్‌కు తరలించారు. ఫీజులు పెంచి పేద విద్యార్థులను చదువులకు దూరం చేయలేరని పోలీస్ స్టేషన్లలో పుస్తకాలు చదువుతూ నిరసన తెలిపారు. పెంచిన ఫీజును తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 4న సూర్యపేటలో జరిగే తెలంగాణ జన సమితి (టీజేఎస్) 3వ ప్లీనరీని విజయవంతం చేయాలని టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ప్లీనరీ విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగేష్, నరేందర్, కృష్ణ, రాము, బాలు, సతీష్, కిరణ్, అక్షయ్, ప్రవీణ, రేణుకా, అనిత, సురేందర్ పాల్గొన్నారు.

నియామకం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వ్యాయామ విద్య (ఫిజికల్ ఎడ్యుకేషన్) ఫ్యాకల్టీ డీన్‌గా సీనియర్ అధ్యాపకులు ప్రొ.రాజేష్‌కుమార్ నియమితులయ్యారు. గతంలో వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్, హెడ్, బీవోఎస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా పదవులు చేపట్టిన ప్రొ.రాజేష్‌కుమార్ డీన్‌గా నియమితులవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు





పూజల్లో పాల్గొన్న మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

దుండిగల్: దుండిగల్‌లోని శ్రీవిశ్వేశ్వర, రేణుకాఎల్లమ్మ దేవాలయ యంత్ర విగ్రహ స్థిర ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ప్రాతఃకాల అర్చనలు, దీక్షా హోమాలు, గర్తన్యాసాలు, యంత్ర ప్రతిష్ఠ, బింబ స్థాపనలు, కళాన్యాసం, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కలశ ఉద్యాసన, అవబృధం, పార్వతీ పరమేశ్వర కల్యాణం తదితర పూజలను నిర్వహించారు. మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయి

శాసనమండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



కుత్బుల్లాపూర్: ప్రతిపక్షాలు అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నాయని... గడచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పేరు ప్రఖ్యాతలు దేశం మొత్తం వినిపిస్తున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కొమరం భీమ్ - ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జ్‌గా జూన్ 2వ తేదీన జరిగే తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న శంభీపూర్ రాజు గురువారం ×సాక్షి×తో మాట్లాడారు. ఈనెల 2 తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగే ఉత్సవాలపై ప్రతిపక్ష నాయకులు రాజకీయం చేయడం తగదన్నారు. దీనిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. శరవేగంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్షాలకు మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని... ఈ నేపథ్యంలోనే ఉత్సవాలపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని... దీనిని బీఆర్ఎస్ కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే దిశగా ముందుకు సాగుతామన్నారు. అన్ని నగరాలను విశ్వ నగరాలుగా తీర్చిదిద్దే దిశగా భారీ ఫ్లైఓవర్లు, స్కై వేలు, అండర్ పాస్‌లు, బ్రిడ్జిలు, చెరువులు, నాలాల ఆధునీకరణ పనులపై దృష్టి సారిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచి తప్పకుండా ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి తీసుకురావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సమన్వయంతో విజయవంతం చేద్దాం

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగే వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను మేడ్చల్ - జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా పాటించాల్సిన ప్రొటోకాల్, స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన అలంకరణ,మంత్రితో పాటు కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కూర్చునే సభావేదిక వద్ద ఏర్పాట్లు, అవార్డులు తదితర వాటిని క్షుణ్ణంగా ఆయన పరిశీలించి సంబంధింత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకొని జాతీయ పతాకావిష్కరణ మొదలుకొని తిరిగి వెళ్లే వరకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వేడుకలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో ఉంటూ వారికి కేటాయించిన విధులను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసమూర్తి, ఏసీపీ రామలింగరాజు, ఏవో వెంకటేశ్వర్రావు అధికారులు ఉన్నారు.

ఆక్రమణల మధ్య కొత్తచెరువు

నెలరోజుల్లో కనుమరుగయ్యే ప్రమాదం.!

సుభాష్‌నగర్: తాతల నాటి కాలంలో ఆ చెరువు జలసిరి.. తాగునీటికే కాకుండా వ్యవసాయానికి ప్రాణధార. చెరువును తవ్వించిన వారు పోయారు.. రైతుల పోయారు.. వారితో పాటు ఆ చెరువు కూడా కొంతమంది స్వార్థానికి కనుమరుగై ఆనవాళ్లే కోల్పోయింది. కంటికి రెప్పలా కాపాడాల్సిన అధికారులే కబ్జాదారులకు తొత్తులుగా మారి రేపటి తరానికి ఉపయోగపడాల్సిన చెరువును కాలగర్భంలో కలిపేస్తున్నారు. అందుకు నిదర్శనంగా సూరారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌లో కబ్జాకు గురవుతున్న కొత్త చెరువునే చెప్పుకోవచ్చు.

చెరువు చరిత్ర....

సూరారం గ్రామాన్ని ఆనుకుని గాజులరామారం సర్వే నం.23లో 7 ఎకరాల విస్తీర్ణంలో కొత్తచెరువు ఉంది. వర్షాకాలంలో ఎగువ ప్రాంతమైన అటవీ నుండి స్వచ్ఛమైన నీరు ఈ చెరువు లోకి వచ్చి చేరుతుంది. తాగునీటికే కాకుండా సంవత్సరంలో రెండు పంటలను ఈ చెరువు ద్వారానే సాగు చేసేవారు. ప్రస్తుతం వ్యవసాయ పొలాల్లో ప్లాట్లు, లేఅవుట్లు రావడంతో చుట్టూ పూర్తిగా కాంక్రీట్ జంగల్‌గా మారింది. శ్రీరామ్‌నగర్, కృష్ణానగర్, వేమారెడ్డినగర్ కాలనీలు, సోనియాగాంధీ బస్తీల వెలిశాయి. దీంతో కబ్జాదారులు ఇప్పటికే 5 ఎకరాల చెరువులో మట్టిని పోసి నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం అక్కడ గజం విలువ రూ. 50 వేల నుంచి 60 వేలు పలుకుతుండడంతో మిగిలి ఉన్న రెండు ఎకరాలపై కబ్జాదారుల కన్ను పడింది. రాత్రికి రాత్రే ఓ వ్యక్తి మట్టిని నింపుతూ వెంచర్‌గా మార్చి 200 గజాల చొప్పున ప్లాట్లుగా మారుస్తున్నాడు.



సూరారం కొత్త చెరువులో మటితో నింపుతున్న దృశ్యం

పలుమార్లు సాక్షి వెలుగులోకి..

గతంలో కొత్తచెరువు కబ్జాలపై పలుమాలు ×సాక్షి×లో వరుస కథనాలు రావడంతో అప్పట్లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కొన్ని నిర్మాణాలను తొలగించారు. అయినప్పటికీ కబ్జాలు షరామాములుగా మారాయి.

గతేడాది వర్షాలు గుణపాఠం నేర్పినా..

గత సంవత్సరం వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు, కొత్తచెరువు దిగువ బాగానే ఉన్నా రామారం చెరువు కట్టు కాలువపై వెలసిన నిర్మాణాలు (ఓక్షిత్ ఎంక్లేవ్) రోజుల తరబడి జలదిగ్బంధంలో చిక్కుకుంది. అప్పట్లో ఇరిగేషన్ శాఖకు గుణపాఠం నేర్పింది. అయినప్పటికీ సంబంధిత అధికారులకు చలనం లేకపోవడం వలన ప్రస్తుతం రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొత్తచెరువు కబ్జాకు అధికారులే పచ్చ జెండా ఊపినట్టు ఉంది.



భవిష్యత్‌లో నష్టం..

ఇప్పటికే సూరారంలోని కొన్ని ప్రాంతాలలో 1200 ఫీట్లు మేర బోర్లు వేసినప్పటికీ నీటి జాడలేదు. ఇలా చెరువులు కనుమరుగైతే భవిష్యత్ తరాలకు నీటి గండం తప్పదని పలువురు పేర్కొంటున్నారు. ఇక సంబంధిత అధికారులు కబ్జా గురవుతున్న చెరువును కాపాడుతారో, కబ్జాదారులకు వత్తాసు పలుకుతారో వేచి చూడాల్సిందే.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029